బాలోత్సవంలో ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

కళ్యాణదుర్గం టిడిపిలో మూడు ముక్కలాట

◆ కొత్తగా రంగంలోకి 'అమిలినేని' ◆ శరవేగంగా సొంతింటి నిర్మాణ పనులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కళ్యాణదుర్గం టిడిపిలో మూడు ముక్కలాట మొదలవుతోంది. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తాజాగా ప్రముఖ కాంట్రాక్టర్, ఎస్‌ఆర్ కన్‌స్ట్రషన్స్ సంస్థ అధినేత అమిలినేని సురేంద్రబాబు రంగంలోకి దిగారు. టిడిపి టిక్కెట్టు వారికే ఖరారవు తున్నట్టు ప్రచారం నడుస్తోంది. ఇదే సమయంలో ఆయన కళ్యాణ దుర్గం పట్టణంలో ఇంటి నిర్మాణ పనులు చేపట్టడం బలాన్నిస్తోంది. దీంతో ఈ నియోజకవర్గంలో మూడు అధికారిక కేంద్రాలు టిడిపిలో వెలిసినట్టవుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు అంతకు మునుపున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కాదని ఉమామహేశ్వర నాయుడుకి టిక్కెట్టు ఇచ్చారు. అయితే టిక్కెట్టు మార్పు జరగడంతో హనుంతరాయచౌదరి సహకారం అందించలేదు. ఆ ఎన్నికల్లో టిడిపి ఓటమి చెందింది. తదనంతరం కూడా ఈ విభేదాలు కొనసాగుతూనే వచ్చాయి. అనేక సందర్భాల్లో రెండు గ్రూపుల మధ్య విభేదాలు బాహాటంగానే కొనసాగుతూ వచ్చాయి. అనేక మార్లు నేతల మధ్య సయోధ్య కుదిర్చేందుకు అధిష్టానం ప్రయత్నించినా ఫలితం లేదు. ఇప్పటికీ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులే ఉన్నాయి. 2024 ఎన్నికల్లోనూ ఇద్దరు టిక్కెట్టు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ గ్రూపు విభేదాలు మధ్య మరో వ్యక్తిని అవకాశం కల్పిస్తారన్న చర్చ నడుస్తోంది. కొత్తవారికిచ్చి ఇద్దరి మధ్యనున్న గ్రూపు విభేదాలకు పుల్‌స్టాప్ పెడుతారన్న చర్చ ఆ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. ఈ క్రమంలోనే ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత సురేంద్ర పేరు తెరపైకి వస్తోంది. ఈ నియోజకవర్గం బరిలో నిలిచేందుకు వారు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు తాజాగా ఇంటి నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో అధిష్టానం నుంచి ఏదైనా సంకేతాలు అందాయా అన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది. గతంలోనూ ఇదే రకంగా సురేంద్రబాబుకు టిక్కెట్టు ఖరారైనట్టు ప్రచారం నడించింది. 2014 ఎన్నికల సమయంలో అనంతపురం అర్బన్ టిక్కెట్టు ఖరారైందని, ఆయన అనుయాయులు సంబరాలు కూడా జరుపుకున్నారు. చివరి నిమిషంలో మార్పు జరిగి ప్రభాకర్ చౌదరికి కేటాయించారు. దీంతో ఆయన అనుయాయుల్లో తీవ్రమైన నిరాశ ఎదురైంది. 2019లోనూ ఆశించినప్పటికీ అధిష్టానం టిక్కెట్టు ఖరారు చేయలేదు. ఇప్పుడు మరోమారు ఆయన పేరు తెరపైకి వస్తోంది. అయితే పార్టీ నుంచి అటువంటి సంకేతాలొచ్చాయా.. లేదా.. అన్నది మాత్రం స్పష్టత లేదు. సురేంద్రబాబు ప్రతిసారీ టిక్కెట్టు ఖరారవుతున్నట్టు ప్రచారం జరగడం చివరి నిమిషంలో వాయిదా పడటం జరుగుతూ వస్తోంది. 2009 ఎన్నికల్లో నుంచి ఇదే రకంగా జరుగుతోంది. 2009 సంవత్సరంలో ప్రజారాజ్యాం పార్టీ టిక్కెట్టు ఆశించారు. అనంతపురం అర్బన్ టిక్కెట్టు ఖరారైనట్టు ప్రచారం నడిచి, చివరి నిమిషంలో వాయిదా పడింది. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తికి గురై ఆ పార్టీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి అధికారికంగా ఏ పార్టీలో చేరనప్పటికీ టిడిపికి అనుకూలంగా ఉంటూ వచ్చారు. ఇక్కడ కూడా ఎన్నికల ప్రతిసారీ పేరు వినిపించడం వాయిదా పడటం ఆనవాయితీగా మారింది.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందాలి

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

హిందూపురం వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పేదలకు మెరుగైన ఆధునిక వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఆసుపత్రి సూపరింటెండెంట్ రోహిల్ కుమార్, డిసిహెచ్ఎ తిప్పేంద్ర నాయక్, లక్ష్మీకాంతరెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రుల్లో ఆధునిక సదుపాయాలు కల్పించి, వైద్య సిబ్బంది నియామకం చేపట్టిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తదితర కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వైద్యులు వీటిని వినియోగించి ప్రజలను మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రి కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పించడానికి పలు నిర్ణయాలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు, ఆక్సిజన్ లైసెన్సు, ఆసుపత్రి జనరేటర్ బ్రేకర్స్ పెద్దవి రిపేర్ చేయడానికి, ఆసుపత్రి నందు దుప్పట్లు మార్చడానికి, శానిటేషన్ వర్క్, డి సి హెచ్ ఓ, ఆంధ్రప్రదేశ్ మెడికల్ విధాన్ పరిషత్ అధికారులతో, ఎన్జీవో సహకారంతో, ఆసుపత్రికి అవసరమైన పరికరాలు కొనుగోలు చేయడానికి కమిటీ ఆమోదంతో కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఎ, సెల్వీ ఆంటోని, హిందూపురం ఆసుపత్రి హెడ్‌నర్స్ సౌదా మునిష్ తదితరులు పాల్గొన్నారు.

బడన్నపల్లిలో జగన్న ఆరోగ్యసురక్ష

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పేద ప్రజల ఆరోగ్యమే తమ లక్ష్యమని మెడికల్ ఆఫీసర్ పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బడన్నపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని-2 బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 396 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేక వైద్య నిపుణులు నివేదిత, వెంకటేశ్వర్లు వైద్య చికిత్సలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో నబి, పంచాయతీకార్యదర్శి నిర్మల, సర్పంచుతో పాటు ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప, సిహెచ్ఓ కళావతి,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎఓగా పివి.రమణ బాధ్యతల స్వీకరణ

కదిరి అర్బన్ : స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మంగళవారం అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పివి రమణ బాధ్యతలు స్వీకరించారు. పెనుగొండలో విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా కదిరి ఆర్డీవో కార్యాలయానికి వచ్చారు. ఆర్డీవో కార్యాలయం సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ఔరా.. అనిపించే(బా)లా..!

◆ 2వ రోజూ ఉత్సాహభరితంగా బాలోత్సవాలు

◆ పిల్లల ఆట,పాటలతో కనులవిందు

◆ చూపరులను కట్టిపడేసేలా ప్రదర్శనలు

◆ బాలోత్సవం నిర్వహణపై సర్వత్రా హర్షాతిరేకాలు

◆ అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు..!

◆ ఏకపాత్రాభినయంతో అలరించారు..!

◆ పాటలు, డ్యాన్సులతో అదరగొట్టారు.!

◆ చూడచక్కని అభినయంతో ఔరా అనిపించారు..!

◆ చిట్టి ప్రయోగాలతో గట్టివారిమని నిరూపించారు... !

◆ బాలోత్సవం వేదికగా చిన్నారులు 'అనంత' సందడితో చూపరులను సమ్మోహితులను చేశారు..!

బాలోత్సవంలో నాట్య ప్రదర్శన చేస్తున్న చిన్నారి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చిన్నారుల 'అనంత' ప్రదర్శనలతో బాలోత్సవం చూపురులను కనువిందు చేస్తోంది. పిల్లల మోములో ఆనందం, తల్లిదండ్రుల కళ్లల్లో చెప్పలేనంత సంతోషంతో బాలోత్సవ ప్రాంగణం కళకళలాడింది. వేలాది మంది 'అనంత'భావిభారత విజ్ఞాన సంపన్నులు బాలోత్సవ వేదికల మీద సాక్షత్కరిస్తున్నారు. రంగం ఏదైనా ప్రతిభ చాటడమే మా ధ్యేయం అంటూ ముందుకు సాగుతున్నారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో మంగళవారం 2వ రోజు జరిగిన అనంత బాలోత్సవాల్లో ఎందరో బాల మేధావులు వారి ప్రతిభను చాటారు. వారి తెలివితేటలను చూసి తమనుతాము మైమరచిపోని వారుండరంటే అతిశయోక్తి కాదేమో. రెట్టించిన ఉత్సాహంతో చిన్నారులు పట్టపగ్గాల్లేనంత సంతోషంతో సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు అలుపూసొలుపు లేకుండా పోటాపోటీగా ప్రదర్శనలు చేశారు. అడకమిక్, కల్చరల్ పోటీల్లో వందల సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వారి తెలితేటలతో అందరినీ ఆకట్టుకున్నారు. కల్చరల్ పోటీల్లో తమ ప్రదర్శనలతో అందరినీ ఆకర్శించారు. నృత్య ప్రదర్శనలు అందరినీ ఉర్రుతలూగించాయి. నాటిక ప్రదర్శనలు ఆలోచింపజేసేలా ఉన్నాయి. జానపద నృత్యాలు, దేశభక్తి గీతాలు, లఘు నాటికలు క్లాసికల్ డాన్స్, ఏకపాత్రాభినయం, రైమ్స్ అలాపనలు తెలుగు, ఇంగ్లీషు, షార్టు ఫిల్మ్ విశ్లేషణలు జరిగాయి. ఇక అకడమిక్‌లో వార్త రచన, మ్యాప్, వకృత్వ పోటీలు, క్విజ్ తదితర విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఎంతో చురుగ్గా పాల్గొని ప్రతిభాను చాటి చెప్పారు. ఉత్సహబరిత వాతావరణంలో జరుగుతున్న ఈ పోటీలను తిలకించేందుకు నగరవాసులు అనేక మంది ఆర్ట్స్ కళాశాల మైదానంకు విచ్చేసి ఆసక్తిగా తిలకించారు. బాలోత్సవాల ప్రదర్శన, నిర్వహణ చాలా బాగుంది అంటూ అక్కడికొచ్చిన వారు హర్షం వ్యక్తం చేశారు. పిల్లల్ని ప్రోత్సహించేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. డ్యాన్స్ మాస్టర్‌లు వన్నూర్, కత్తి విజయ్‌కుమార్, నాట్యాచార్యులు పట్నం శివ ప్రసాద్ ప్రదర్శనలు చేసి పిల్లల్లో ఉత్సాహాన్ని నింపారు.

వివిధ వేషధారణలో చిన్నారుల ప్రదర్శనలు

విజేతలకు అవార్డుల ప్రధానం

అనంత బాలోత్సవం పోటీల్లో విజేతలకు అతిథులు అవార్డులు అందజేశారు. అనంత బాలోత్సవ కమిటీ సభ్యులు వి.కోటేశ్వరప్ప ఆహ్వానితులుగా వ్యవహరించగా అనంత బాలోత్సవ కమిటీ కోశాధికారి జిలాన్ అధ్యక్షతన ఛైర్ పర్సన్ షమీమ్ షఫీవుల్లా నేతృత్వంలో అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం జిల్లా డిప్యూటీ డిఇఒ శ్రీనివాసరావు, ఎడి క్రిష్ణయ్య, సూపరింటెండెంట్ ఆదినారాయణ, ఆర్‌డిటి ఛైర్మన్ తిప్పేస్వామి, విన్నర్స్ క్లబ్ శ్రీవల్లి, అనంత బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, కమిటీ సభ్యులు లింగమయ్య, కోటేశ్వరప్ప, గోవిందరాజులు, ఏజి.రాజమోహన్, ఓతురు పరమేష్, రామాంజినమ్మ, న్యాయ నిర్ణేతలు, రచయితలు, మేధావులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

భరతనాట్యం చేస్తున్న చిన్నారులు....

ఇళ్ల మంజూరులో నిర్లక్ష్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం వ్యాప్తంగా సొంతిళ్లు లేని వారందరికి ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ విమర్శించారు. ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు, గృహాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నాడు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ముందు ఆందోళన చేపట్టారు. కమిషనర్ అందుబాటులో లేక పోవడంతో ఛైర్‌పర్సన్ ఛాంబర్ ముందు నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో నివాసం ఉంటున్న బడుగు, బలహీన వర్గాల వారు దాదాపు 20 సంవత్సరాల నుంచి సొంతిళ్లు లేక అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నారన్నారు. అద్దెలు చెల్లించ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మూడేళ్ల కిందట ఎంపిక చేసిన వారితో పాటు కొత్తగ సచివాలయ ఉద్యోగులతో సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం, ఇళ్లను మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ అల చేయలేదన్నారు. లబ్ధిదారులు ధరఖాస్తులను సచివాలయాల్లో ఇస్తే ఆన్‌లైన్ చేయడానికి అనుమతులు లేవని నిరాకరిస్తున్నారని చెప్పారు. పేదలు కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు లేరంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. వెంటనే ధరఖాస్తులను సచివాయాల్లో తీసుకుని వాటిని ఆన్‌లైన్ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంబదనల మేరకు 90 రోజుల్లో అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలను, ఇళ్లను మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో భూపోరాటం చేసి, ప్రభుత్వ స్థలాలను పేదలకు పంచుతామన్నారు. ఈ విషయంపై స్పందించిన ఛైర్‌పర్సన్ సమస్యను తెలుసుకుని కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేయిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో పేదలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, రాయుడు, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ అధ్యక్షురాలు నసీం తాజ్, కార్యదర్శి విమల కుమారి, లక్ష్మీదేవి, రమాదేవి, శశికళ, సరస్వతమ్మ, రెడ్డమ్మ, సిఐటియు పట్టణ నాయకులు అత్తర్‌బాబా, నీలమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

సచివాలయం సర్వేయర్

ఆత్మహత్యాయత్నం

తహశీల్దార్ మాటలతో మనస్తాపం అంటూ ఆవేదన

ప్రజాశక్తి-కదిరి టౌన్, తనకల్లు

తహశీల్దార్ దూషణలు పనిఒత్తిడి కారణంగా సచివాలయం సర్వేయర్ ఆత్మహత్యా యత్నంకు పాల్పడిన ఘటన తనకల్లు మండలంలో మంగళవారం నాడు చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కదిరి నియోజకవర్గం తనకల్లు మండలం టి.సదుం సచివాలయం సర్వేయర్‌గా విజిత విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల తహశీల్దార్ శోభా సువర్ణమ్మ తనను కావాలనే కక్ష సాధింపుతో వేధింపులకు గురి చేస్తోందని ఆమె పేర్కొన్నారు. నిర్ణీత వేళల్లో కాకుండా రాత్రి సమయాల్లో కూడా విధులు నిర్వహించమని ఆదేశాలు జారీ చేసేవారని తెలిపారు. కులగనణ సర్వే చేయాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మంగళవారం ఉదయం తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిన విజితను వ్యక్తి గతంగా దూషించినట్లు తెలుస్తోంది. దీంతో తీవ్ర మానసిక వేదనకు లోనై ఇంటికి వచ్చిన ఆమె సూపర్ వాస్మాయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు బాధితురాలి తల్లిదండ్రులు తెలిపారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగా ఈ విషయంపై తహశీల్దార్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించా తప్పా, ఎలాంటి వ్యక్తిగత దూషణలు చేయలేదని వివరణ ఇచ్చారు.

అధైర్య పడొద్దు.. మీ వెన్నంటే ఉంటాం...

నారా భువనేశ్వరి

ప్రకాష్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

టిడిపి నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని మీ వెన్నంటే ఉంటామని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పర్యటనలో భాగంగా నిజం గెలవాలి అనే కార్యక్రమంలో పాల్గొనేందుకు మూడు రోజులపాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించిడానికి వచ్చిన నారా భువనేశ్వరికి టిడిపి నాయకులు పుట్టపర్తి విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో పాటు మాజీ మంత్రి పరిటాల సునీత, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, కదిరి టీడీపీ ఇన్‌ఛార్జ్ కందికుంట వెంకటప్రసాద్ , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, సవితమ్మ సంగా సుధాకర్, సత్యసాయి జిల్లా టిడిపి నాయకులు భువనేశ్వరికి స్వాగతం పలికారు. విమానాశ్రయం నుండి ఆమె ప్రత్యేక కాన్వాయ్ లో పుట్టపర్తి మండల పరిధిలోని గాజుల పల్లి గ్రామానికి బయలుదేరగా ఆమెకు మామిళ్లకుట క్రాస్, కప్పల బండ ,పెడపల్లి, కొట్లపల్లి గ్రామంలో, మహిళలు పెద్ద సంఖ్యలో ఆమెకు స్వాగతం పలికారు.అనంతరం పుట్టపర్తి మండల పరిధిలోని నిడిమామిడి పంచాయతీలోని గాజులపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త మునిమడుగు బావయ్య కుటుంబానికి భువనేశ్వరి పరామర్శించారు. అనంతరం బావయ్య కుటుంబ సభ్యులకు రూ.3లక్షల విలువైన చెక్కును అందజేశారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ విజయ్ కుమార్, జయప్రకాష్, గూడూరు ఓబులేసు, శ్రీరామిరెడ్డి, శ్రీరామ్ నాయక్, పుల్లప్ప, జనసేన నాయకులు పత్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుళ దేవర చెరువు : మండల పరిధిలోని గాజుకుంట్లపల్లి గ్రామంలో టిడిపి కార్యకర్త మేకల రామచంద్రరావు కుటుంబానికి భువనేశ్వరి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.3లక్షల విలువైన చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే పరిటాల సునీత, మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పిటిసి పిట్ట ఓబుల్ రెడ్డి, బూదిలి ఓబుల్ రెడ్డి, షేక్ నిజాం, జిల్లా తెలుగు రైతు మీడియా కోఆర్డినేటర్ ఆర్ఎంపీ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : నిజం గెలవాలి అనే పర్యటనలో భాగంగా పట్టణం రాజీవ్ గాంధీ 8 వ వార్డులో మృతిచెందిన టిడిపి యువ నాయకులు ప్రకాష్ కుటుంబాన్ని నారా భువనేశ్వరి మంగళవారం పరామర్శించారు. మృతుని కుటుంబసభ్యులకు మూడు లక్షల రూపాయల విలువైన చెక్కును అందజేశారు. అలాగే కదిరి నియోజకవర్గంలో పలు మండలాలలోని మృతిచెందిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్క కుటుంబానికి మూడు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. కదిరి నియోజకవర్గ పరిధిలోని తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, తలుపుల, నంబులపూలకుంట మండలాలలోని పలు గ్రామాలలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె. పార్థసారధి, కదిరి ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీ నగర్ లో గల శ్రీ మారుతీ రాఘవేంద్ర స్వామి కళ్యాణ మండపంలో బుధవారం మహిళా ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో గల చేనేత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గం ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతున్నట్టు వారు తెలిపారు.

మణికంఠ కాలనీలో తాగునీటి ఇక్కట్లు

సోమందేపల్లి : మండల కేంద్రంలోని మణికంఠ కాలనీలో సుమారు పది రోజులుగా నీటి సౌకర్యం లేక కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. కేబుల్ లైన్ ఏర్పాటు కోసం జెసిపి తో కాలవ తవ్వించారని అందులో భాగంగానే కాలనీకి వచ్చే తాగునీటి పైప్ లైన్ ధ్వంసం అయిందనని అన్నారు. నీటి సౌకర్యం లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇష్టపడి చదవండి

పెనుకొండ : విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పట్టణంలోని శ్రీసత్య సాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ అన్నారు. కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు మంగళవారం ఫేర్వెల్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని క్రమశిక్షణ పట్టుదల అంకితభావంతో చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేష రావు, వైస్ ప్రిన్సిపల్ అశోక్, అధ్యాపకులు మురళీకృష్ణ, రమేష్, చైతన్య, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రశాంత జీవనాన్ని కొనసాగించండి

బుక్కపట్నం : రానున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ప్రజలు ప్రశాంత జీవనానికి అలవాటు పడాలని ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు. మండల పరిధిలోని జానకంపల్లి గ్రామంలో పోలీసులు గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు ఎటువంటి గొడవలు పోకుండా ప్రశాంత జీవనానికి అలవాటు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ రమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు

గాండ్లపెంట : మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో తగిన చర్యలు తీసుకుంటానని తహశీల్దార్ శ్రావణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని రైతులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆమె మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

సజావుగా మండలమీట్

రొద్దం : స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీపీ చంద్రశేఖర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశం సజావుగా కొనసాగింది. ఈ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు హాజరు కాలేదు. హాజరైన అధికారులు మూడు నెలల్లో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి తహశీల్దార్ చంద్రశేఖర్, ఇఒఆర్‌డి కేశవరెడ్డి, రాష్ట్ర స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ అంజన రెడ్డి, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం తహశీల్దార్‌గా భారతి

బుక్కపట్నం : బుక్కపట్నం మండల తహశీల్దార్‌గా భారతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.కడప కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న భారతి బుక్కపట్నం తహశీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కమలాకర్ కడపకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా నూతన తహశీల్దార్ మాట్లాడుతూ సిబ్బంది సహాయ సహకారాలతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

ముదిగుబ్బ : మండలంలోని దొరిగల్లు గ్రామంలో ఏర్పాటు చేసిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌ను స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, వైసిపి పార్లమెంట్ ఇన్‌చార్జి శాంతమ్మ ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సి.వి. నారాయణరెడ్డి ,సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, జడ్పిటిసి తిరుమల సేవే నాయక్, కో ఆప్షన్ సభ్యులు చిన్న బాలముని, సచివాలయ కన్వీనర్ భాస్కర్, నాయకులు పాల్గొన్నారు

'సూపర్ సిక్స్'తో ప్రయోజనం

మడకశిర : తెలుగుదేశం పార్టీ చేపట్టిన చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు పేద ప్రజలకు వరమని ఆపార్టీ తాలూకా డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని రోళ్ల మండలం బీజే హళ్లి పంచాయతీ లోనీ మల్ల సముద్రం గ్రామం లో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి పాండు, రామన్న, హనుమంతు, కాంతారాజు, అభిషేక్ అమ్మోజక్క, శివన్న తిప్పన్న, యంజారప్ప, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కదిరి
O.S.NO:394/2019

Between:
పి.వి.శివారెడ్డి S/o శంకరరెడ్డి, D.No:4-31, దేవరపల్లి, H/o వెలిచెలమల, ఎన్.పి.కుంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

మరియు

ఎ.సుధాకర్ ...ప్రతివాది

ప్రతివాదికి దావా నోటీసు

To
ఎ.సుధాకర్ S/o గంగన్న రాజనాలపల్లి, తలుపుల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా అను నీ పైన వాది అయినటువంటి పి.వి.శివారెడ్డి, తనకు రావలసిన బాకీ వసూలు నిమిత్తమై పై వారి కోర్టు నందు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా మీ హాజరు నిమిత్తం 20/02/2024 వ తేదిన వాయిదా ఉన్నది. సదరి వాయిదా తేదిన మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై వారి కోర్టు నందు ఉదయం 10:30 గం॥లకు హాజరు కావలెను. అట్లు హాజరు కానీ యెడల మీ పరోక్షమంలో తీర్మానం చేయబడునని మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:20/02/2024
స్థలం:కదిరి

వి.ప్రసాద్ రెడ్డి, బి.ఎ., బి.ఎల్,
వాదితరపు న్యాయవాది, కదిరి.

జెఇఇలో 'సువర్ణభారతి' విద్యార్థుల ప్రతిభ

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సువర్ణ భారతీ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన జెఈఈ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. వారిలో గగన్ శ్యామ్ రెడ్డి 99.58 శాతం మార్కులను సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. గగన్ శ్యామ్ రెడ్డి జాతీయలో ప్రథమ స్థానంలో నిలవడంతో అతని తల్లిదండ్రులైన నీలకంఠరెడ్డి, విజయ ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన కుమారుడికి మిఠాయిలు తినిపించారు. అదే విధంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠ రెడ్డి, ఎఒ అనీల్ కుమార్ అధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసి అభినందించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన గగన్ శ్యామ్ రెడ్డి మాట్లాడుతు తనకు రసాయన శాస్త్రం అంటే చాలా ఇష్టం అని, రాబోవు రోజుల్లో మంచి శాస్త్ర వేత్తగా ఎదిగి దేశానికి సేవలను అందించాలన్నదే తన సంకల్పమని అన్నారు. ప్రిన్సిపల్ నీలకంఠరెడ్డి మాట్లాడుతు సాధారణ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి జాతీయ స్థాయిలో రాణించే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. మంచి శిక్షణ ఇవ్వడంతో జాతీయ స్థాయిలో గగన్ శ్యామ్ రెడ్డి 99.58, ఇంద్రవంశీ 94.86, సారిక 88.58, జలశ్రీ 83.08, రక్షిత 82.95, మనోజ్ 86.07, మానస 81.77, అశ్విని 81 శాతం మార్కులు సాధించారన్నారు. ఇందులో గగన్ శ్యామ్‌రెడ్డి తన కుమారుడు కావడంతో చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవీంద్ర రెడ్డి, వేణు, శేషాద్రి మూర్తి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో హరీష్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

ప్రశంసాపత్రాలు చూపుతున్న విద్యార్థులు

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ సరూర్ స్టేడియంలో ఆదివారం సోమవారంలో జరిగిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి హరీష్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్ అక్బర్ అలీ తెలిపారు. ఈ మేరకు వినయ్, వేమంత్, మనోజ్ కుమార్, ఖాద్రి హితేష్ రెడ్డి, అసద్ గోల్డ్ మెడల్ సాధించారన్నారు. అలాగే అస్లాం, సమీర్, కార్తీక్, సాయి గణేష్, వంశీకృష్ణ యాదవ్ సిల్వర్ మెడల్ సాధించారని చెప్పారు. నాగచైతన్య బ్రౌన్జ్ మెడల్ సాధించాడన్నారు. అమ్మాయిల కట్టాస్ విభాగంలో శాలిని గోల్డ్ మెడల్ సాధించగా నాగ గీతిక సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. ప్రతిభా విద్యార్థులకుకరస్పాండెంట్ కిరణ్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాన్ని మెడల్స్ ని అందజేశారు. శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ అక్బర్ అలీని విద్యార్థులను కరస్పాండెంట్ కిరణ్ అభినందించారు ఈ కార్యక్రమంలో కరాటే ఇన్స్పెక్టర్ రియాజ్, పిటి ఖాదర్ భాషా, ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయండి

సమావేశంలో పాల్గొన్న నాయకులు

బత్తలపల్లి : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు,కార్మికులకు, కర్షకులకు, పేదలకు,మోటర్ వెహికల్స్ డ్రైవర్లకు వ్యతిరేకంగా తీసుకు వస్తున్న చట్టాలకు నిరసనగా రైతు సంఘాలు, సిఐటియు,ఏఐటియుసి ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్ ను విజయవంతం చేయాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, ప్రధాన కార్యదర్శి జేవి రమణ, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య తదితరులు మాట్లాడారు. దేశంలోని అన్ని వర్గాల మేలుకొరకు ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప, సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్, సహాయ కార్యదర్శి నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

పవర్ పార్కుల ఏర్పాటుకు భూ సేకరణ వేగవంతం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో విండ్, సోలార్ పవర్ పార్కుల ఏర్పాటుకు భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని కోర్టు హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలో సోలార్ పవర్ పనుల భూ సేకరణకు సంబంధించి అంశంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా పరిధిలో405 ఎకరాల భూ సేకరణ ప్రక్రియ పూర్తయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదాని సంస్థ పనులు చేపట్టిందన్నారు. 500 ఎం డబ్ల్యు చిత్రావతి పంపు హై డోర్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడానికి అదనపు భూమిని తాడిమర్రి మండలం పెద్దకోటలో 24.82 ఎకరాలు కేటాయించాలన్నారు. రామగిరిలో 300 ఎం డబ్ల్యు సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి 8 .44 ఎకరాల భూమిని ఎస్ఇసిఐ వారికి కేటాయించాలని తెలిపారు. భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెట్ క్యాప్ ఎమ్‌డి రమణారెడ్డి, ఉమ్మడి జిల్లాల నెట్ కేఫ్ అధికారి వేణుగోపాల్ రెడ్డి, ధర్మవరం, తాడిమర్రి, కనగానపల్లి, రామగిరి మండలాల రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

రచయితలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-హిందూపురం

రచయితలను ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని, పుస్తకాలు గతానికి, భవిష్యత్తుకు అనుసంధాన కర్తలని మండల విద్యాశాఖాధికారి గంగప్ప అన్నారు. మంగళవారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో నాలుగు మండలాల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఉపాధ్యాయులు సిద్దగిరి శ్రీనివాస్ రచించిన నొళంబవాడి చారిత్రక పరిశోధన పుస్తకాలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సింధూర హోటల్ యజమాని శ్రీనివాస్ తన మిత్రుడు సిద్దగిరి శ్రీనివాస్ రాసిన పుస్తకాలను కొనుగోలు చేసి హిందూపురం, పరిగి, చిలమత్తూరు లేపాక్షి మండలాలలోని ఉన్నత పాఠశాలల గ్రంథాలయాలకు అందజేశారు. ఈసందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ చారిత్రాత్మక పుస్తకాలు గత తరాల జీవన విధానాన్ని అధ్యయనం చేయడానికి తోడ్పాటునందిస్తాయన్నారు. చారిత్రక పరిశోధకులను, రచయితలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు పద్మప్రియ, గంగప్ప, నాగరాజు, లక్ష్మీదేవి. సాల్మన్, రాజు, కుళ్లాయప్ప, ప్రసన్నలక్ష్మి, శేషాచలం, ఎంజీఎం పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యం, కోర్సు డైరెక్టర్ మనోజ్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - బత్తలపల్లి

పోలింగ్‌కేంద్రాల గదులను పరిశీలిస్తున్న కలెక్టర్

జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని కలెక్టర్ పి. అరుణ్ బాబు ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బాలికల ఉన్నత పాఠశాల గదుల పెచ్చులు ఊడిపడుతుండడంతో వాటిని పరిశీలించాలని తహశీల్దార్ శివశంకర్‌నాయక్‌ను ఆదేశించారు. ఇంకా ఎక్కడైనా పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే రాజకీయ పార్టీల నాయకులు వాటికి సంబంధించిన వివరాలను తెలియజేయాలన్నారు. అంతకు మందు దంపెట్ల గ్రామం వద్ద ఉన్న ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, విఆర్ఒలు రాణాప్రతాప్, భరద్వాజ్, విఆర్ఎలు, బిఎల్ఒలు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిని ఆదరించండి : మంత్రి

మెగా చెక్కును అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి గోరంట్ల

2024 ఎన్నికల్లో వైసిపిని ఆదరించాలని రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్ కోరారు. పట్టణంలో హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆసరా నాలుగో విడత చెక్కు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి పాఠశాలల రూపురేఖలే మార్చారన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి నుంచి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు అబద్ధపు ఆరోపణలు చేస్తున్నాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ఎంపీపీ ప్రమీల మూర్తి, జడ్పిటిసి జయరాం నాయక్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎపిఎం నారాయణ, సర్పంచ్ సరోజ నాగే నాయక్ తదితరులు పాల్గొన్నారు

సిద్ధం సభ పోస్టర్లు విడుదల : ఈనెల 18న రాప్తాడులో నిర్వహించే సిద్ధం సభ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్ విడుదల చేశారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హాజరవుతున్న సిద్ధం సభకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనారెడ్డి, రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు

రొద్దం : మండల కేంద్రంలోని రొద్దకాంబ దేవి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళలకు ఆసరా చెక్కును మంత్రి ఉషశ్రీ చరణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, ఇఒఆర్‌డి కేశవరెడ్డి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ చంద్రశేఖర్, జడ్పిటిసి పద్మ, ఎంపీపీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రంలోని వెలుగు ఆఫీసులో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా సంఘాలకు 4వ విడత ఆసరా చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దీపిక మాట్లాడుతూ వైసిపి హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పిటిసి బాణాల శ్రీనివాస్ రెడ్డి,స్థానిక సర్పంచ్ ఆదినారాయణ,వైస్ ఎంపీపీ లీలావతి, అగ్రిబోర్డ్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ ప్రభాకర్ గౌడ్, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేలంలో రూ.2.51లక్షల ఆదాయం

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ పరిధిలో నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ.2.51లక్షల ఆదాయం లభించింది. మున్సిపల్ ఎంఇ వెంకట రమణ సమక్షంలో మంగళవారం కూరగాయాల పెద్ద మార్కెట్, పరగి బస్టాండ్‌లో ఉన్నా ఖాళీ స్థలం, చిన్న, పెద్ద పశువుల మార్కెట్, వాటి తోళ్ల మార్కెట్‌ల వేలం పాటలను నిర్వహించారు. పరిగి బస్టాండ్‌లో ఉన్నా ఖాళీ స్థలాన్ని రూ.17.51లక్షలకు అన్వర్ దక్కించుకున్నారు. చిన్న పశువుల మార్కెట్‌ను రూ. 7.11 లక్షలకు మహేజబీన్ దక్కించుకున్నారు. పెద్ద పశువుల మార్కెట్‌ను రూ.1.17లక్షలకు షిరీన్‌దక్కించుకున్నారు. చివరిగా పెద్ద మార్కెట్ నిర్వహణను రూ.42లక్షలకు నిమ్మకాయ రామాంజినేయులు దక్కించుకున్నారు. దీంతో పురపాలక సంఘానికి రూ.2.51లక్షలు అదనంగా ఆదాయం లభించినట్లు ఎంఇ వెంకటరమణ తెలిపారు. ఖరారు చేసిన వేలం పాటలను కౌన్సిల్‌లో తీర్మానించిన అనంతరం ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31, 2025 వరకు సుంకం వసూలు చేసుకోవడానికి అనుమతులు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఒ సుధాకర్, ఆర్ఐలు రాము, రామాంజినేయులు, జకీవుల్లా, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఆక్రమణకు గురైన స్థలం

పేదల ఇళ్లపట్టాలపై పెద్దల కన్ను

ప్రజాశక్తి - రొద్దం

పేదల ఇళ్ల పట్టాలపై పెద్దల కన్ను పడింది. మండలంలోని పెద్ద గువ్వల పల్లి గ్రామంలో 1278 సర్వే నెంబర్‌లోని కొంత భాగాన్ని పేదల కోసం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి కేటాయించింది. హౌస్ పట్టాలలో ఒక్కొక్కరికి ఒకటిన్నర సెంట్ చొప్పున కొంతమందికి జగనన్న ఇళ్ల పట్టాలు అందజేశారు. అయితే మిగిలిన దాదాపు నాలుగైదు ఎకరాల భూమిలో పెద్దలకన్నుబడింది. దీంతో పలుకుబడి ఉన్నవారు, వాలంటీర్లు, వారికి ఎంత కాబడితే అంత భూమిని చదును చేసుకుని బండలు పాతుకుతున్నారు. పేదలకు కనీసం రెండు మూడు సెంట్లు కూడా ఇవ్వకుండా ఒక్కొక్కరికి ఒక్కొక్క సెంటు ఒకటిన్నర సెంటు అందజేసి చేతులు దులుపుకున్నారు. అయితే పెద్ద పెద్ద గృహాలు నిర్మించుకొని భూస్వాములుగా ఉన్న వారికి మాత్రం వారికి నచ్చినంత పాగా వేసుకున్నా పట్టించుకోలేదు. దీనిపై అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొత్తచెరువు : మండల పరిధిలోని నారేపల్లి, కేసాపురం, మైల సముద్రం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మంగళవారం పరిశీలించారు. కేంద్రాల వద్ద మౌలిక వసతులపై ఆరా తీశారు. రెవిన్యూ అధికారులతో మండలంలోని పోలింగ్ స్టేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కళావతి, డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, వీఆర్వో భార్గవ్ తదితరులు పాల్గొన్నారు

కంటిని కాపాడుకోండి

ధర్మవరం టౌన్ : ప్రతి వ్యక్తి వారి కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని రిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ శరీరానికి మెదడు, కళ్లు చాలా ముఖ్యమన్నారు. వృద్ధులు, పిల్లలు, యువతీ, యువకులు కంటి సమస్య ఉన్నవారు తప్పనిసరిగా కంటి వైద్యులచే వైద్య చికిత్సలు చేయించుకోవాలన్నారు. కంటిని నిర్లక్ష్యం చేస్తే చూపు పోయే ప్రమాదం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల ముఖ్యంగా కళ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా చేనేత పరిశ్రమలు నమ్ముకున్న చేనేత కార్మికులు తమ కంటికి పూర్తి వెలుగునిచ్చే అవకాశంగా ఉండాలని, వీరికి ఉచిత వైద్య చికిత్సలను కూడా తాను అందిస్తున్నానని తెలిపారు.

సిసి రోడ్డు ప్రారంభం

గాండ్లపెంట : మండల పరిధిలోని జీనలకుంట నుంచి పోతవాళ్లపల్లి వరకు 53 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డును స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి మంగళవారం ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ జి రవీంద్రారెడ్డి, ఎంపీపీ జగన్ మోహన్, సర్పంచి రహమతుల్లా, రవీంద్రా నాయక్, సింగల్ విండో అధ్యక్షుడు ఎస్ పి హైదర్ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ మృతికి నివాళి

గోరంట్ల రూరల్ : గోరంట్ల -4 సచివాలయంలో వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న మునీర్ అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీ చరణ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నూర్ మొహమ్మద్, పాలే జయరామ్ నాయక్, శివారెడ్డి, హరినాథ్ రెడ్డి, ఉప సర్పంచి రాజారెడ్డి, విజయసింహారెడ్డి, పోతుల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు పోస్టర్లు విడుదల

మడకశిర : హజ్రత్ సయ్యద్ మస్తాన్ ఉరుసు వీరమారన్న స్వామి కాళ ఉన్నిమ జాతర పోస్టర్లను ట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాలాజీ నగర్లో మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి , మైనార్టీ సెల్ అధ్యక్షుడు భక్తర్ ,పట్టణ అధ్యక్షుడు మనోహర్ తదితరులుపాల్గొన్నారు.

సిఎంను కలిసిన ఇస్మాయిల్

కదిరి అర్బన్ : తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కదిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి మాజీ సమన్వయకర్త ఎస్ఎండి ఇస్మాయిల్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మంగళవారం కలిశారు. ఈసందర్భంగా సిఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కదిరి నియోజకవర్గంలో వైసిపి స్థితిగతులపై సిఎం తనను అడిగినట్లు ఇస్మాయిల్ తెలిపారు.

టీడీపీలో పలువురు చేరిక

చెన్నేకొత్తపల్లి : మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. చెన్నేకొత్తపల్లి మండలంలోని వైసిపికి చెందిన 30కుటుంబాలు అనంతపురం లోని పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో మంగళవారం టిడిపిలో చేరాయి. వారందరికీ పరిటాల సునీత టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని వెల్దుర్తి, నాగసముద్రం గ్రామాలకు చెందిన మాజీ సర్పంచి వీరజిన్నప్ప, వార్డు మెంబర్ చంద్రశేఖర్, రామాంజనేయులు, చిన్ని బాబయ్య, ఓబులేసు, పెద్ద బాబయ్య, కల్లి పోతన్న, వెట్టి నారాయణ, నారాయణ, నారాయణస్వామి, మారుతి, శ్యామల, కార్తీక్, హరీష్ బాబు, ఓంప్రసాద్, సల్లప్ప, కందుకూరి ఆదెప్ప తదితరులు పార్టీలో చేరారు. వైసీపీ విధానాలు, ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి తీరుతో విసిగిపోయి తాము టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ కొత్తగా పార్టీలోకి వచ్చామన్న భావన వద్దని.. అందరితో కలసి టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు.

పార్టీలోకి చేరిన వారితో పరిటాల సునీత

మసీదు నిర్మాణానికి విరాళం

కదిరి టౌన్ : ముదిగుబ్బ మండల కేంద్రంలో మసీదు నిర్మాణానికి చాంద్ బీ మెమోరియల్ ట్రస్ట్ అధినేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లయన్ ఖాసింఖాన్ విరాళం అందజేశారు. ఈ మేరకు 75 వేల రూపాయలను మసీదు కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. అదేవిధంగా ముదిగుబ్బ మండలంలోని తన స్వగ్రామం నాగా రెడ్డి పల్లిలో మసీదు నిర్మాణానికి రూ. 50వేలు, వృద్ధాశ్రమానికి రూ. 25వేలు, కదిరి రూరల్ మండలం ముత్యాల చెరువు గ్రామం నందు బయరెడ్డి నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి రూ. 25వేలు అందజేశారు. ఈ సందర్భంగా లయన్ ఖాసింఖాన్ మాట్లాడుతూ తన తల్లి యొక్క జ్ఞాపకార్థం గత 20 సంవత్సరాల క్రితం చాంద్‌బీ మెమోరియల్ ట్రస్టు నెలకొల్పి ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తానని చెప్పారు.

చెక్కును అందజేస్తున్న లయన్‌ఖాసీం ఖాన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఓబుళదేవర చెరువు : జగన్ ప్రభుత్వంలోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓడి చెరువు, నల్లమాడ, అమడగూరు మండలాలకు సంబంధించిన వైయస్సార్ ఆసరా నాలుగో విడత రుణమాఫీ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం రమణప్ప, ఎంపీపీ పర్వీన్ భాను, జడ్పిటిసి దామోదర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్లకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ రాజు నాయుడు షామీర్, సర్పంచులు గోవిందు, రంగారెడ్డి, వెంకటరమణ, బాబా ఫక్రుద్దీన్, ఆబిదా రఫిక్, భారతి సిమెంట్ రఫిక్, అశ్వత్ రెడ్డి, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

సోమందేపల్లి : మండల పరిధిలోని వెలగమాకులపల్లి తండా వాసుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో తండావాసులు మంగళవారం స్థానిక గుడిపల్లి గ్రామ సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్న కొద్దిపాటి గిరిజన కుటుంబాలు కూడా తండాలో నెలకొన్న సమస్యల వల్ల భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి తండాలో ఉన్న గిరిజన కుటుంబాలకు ప్రత్యామ్నాయంగా గుడిపల్లి పొలంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ఇంటి స్థలాలు పంపిణీ చేసి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో సర్పంచి గిరిజమ్మ నాగరాజారావ్, సిపిఎం నాయకులు రామంజనేయులు, ప్రభావతి భాయ్, దేవి బాయ్, పార్వతిబాయ్, మంజుబాయ్ , లక్ష్మిబాయ్, క్రిష్ణ నాయక్, బంకిబాయ్, దూబ్లీబాయ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన మహిళలు, నాయకులు